పెనాల్టీ ఫీజు తీసుకోకుండా అనుమతించాలి



బాలానగర్: వన్‌టైం ఛాన్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులై ప్రాజెక్టులను సబ్‌మిట్ చేయడానికి అర్హత పొందిన ఎంటెక్ ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు సంబంధించిన విద్యార్థులకు ఎటువంటి పెనాల్టీ ఫీజు తీసుకోకుండా అనుమతించాలని విద్యార్థి నాయకులు కోరారు. ఈ మేరకు జేఎన్‌టీయూలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరావుకు మంగళవారం స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రాహుల్ నాయక్, సాగర్‌నాయక్, ఆనంద్‌కుమార్, జవ్వాజి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేతనం అందజేత



వేతనాన్ని అందజేస్తున్న శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్ డా. సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి: శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్ డా. సత్యం శ్రీరంగం శ్రీరంగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2025–26 సంవత్సరానికి మొత్తం ప్రతి నెలా వేతనాన్ని ఇస్తామని హామీ ఇచ్చారు. కేపీహెచ్‌బీ రోడ్డు నెంబర్ 2, బాలాజీనగర్ డివిజన్ వివేక్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు మీనాకుమారి, సృజనల అభ్యర్థన మేరకు ఉపాధ్యాయులకు వేతనాన్ని అందజేస్తామన్నారు. జులై వేతనాన్ని చెక్కు రూపంలో మంగళవారం ఆయన కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు అందించారు.

విజేతలకు బహుమతులు ..



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్ బేతల్ గాస్పల్ చర్చ్ ఆధ్వర్యంలో ఆగస్టు 15న పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు మంగళవారం బేతల్ గాస్పల్ చర్చ్ పాస్టర్ గోపి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహేష్, ఖలీం, కటిక రవి, పాషా, ప్రసాద్, యోగి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కిటకిటలాడిన మార్కెట్లు

జోరుగా పండ్లు, పూలు, పూజా సామాగ్రి కొనుగోళ్లు



వినాయక చవితికి ఆకులు, పూలు, పత్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

ఓల్డ్ బోయిన్‌పల్లి: వినాయక చవితిని పురస్కరించుకొని పూజా సామగ్రిని విక్రయించేందుకు ఏర్పాటు చేసుకున్న కేంద్రాలతో ఓల్డ్ బోయిన్‌పల్లిలోని వివిధ ప్రాంతాలన్నీ కిటకిటలాడియి. ఓల్డ్ బోయిన్‌పల్లి చౌరస్తాలోని మార్కెట్ ప్రాంతంలో విపరీతమైన రద్దీ నెలకొంది. పండ్లు, పూలు, ఇతర పూజా సామగ్రి విక్రేతలతో పాటు పూజకు వినియోగించే పత్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన మహిళలతో సందడి నెలకొంది. మారేడ్ ఆకు, గరక, ఉమ్మెంత, రేగు, ఉత్తరేణి, తులసీపత్రం, మామిడి, గన్నేరు, దానిమ్మ, వావిలీ, జాజిపత్రి, జెమ్మీ, రావి, జిల్లెడు, తమల, అరటి ఆకులతోపాటు పాలగోష, అరటి పండ్లు, జామకాయలు కొనుగోలు చేశారు. మట్టి గణపతుల కొనుగోళ్లలో మునిగిపోయారు.

ముస్తాబైన మండపాలు

వాడా వాడాలలో వెలిసిన మండపాలు అందంగా ముస్తాబయ్యాయి. రంగు రంగుల విద్యుత్ దీపాలతో చూపరులను కట్టిపడేసే భారీ సెట్టింగులు, కళ్లు చెదిరే అలంకరణలు, వైవిధ్యమైన రూపురేఖలతో ఆకర్షణీయమైన ప్రతిమలు వెలసి ఓల్డ్‌బోయిన్‌పల్లిలోని వివిధ ప్రాంతాల్లో వినాయక చవితి పండుగకు మండపాలు ముస్తాబయ్యాయి. బుధవారం నుంచి మొదలయ్యే వినాయక నవరాత్రి వేడుకల కోసం ఆయా ఉత్సవ నిర్వాహకులు పోటాపోటీగా ఏర్పాట్లు చేశారు.

మూసాపేట: వినాయక చవితి పండుగకు మార్కెట్లు కళకళలాడాయి. భక్తులు, ప్రజలు వినాయక ప్రతిమలు, పత్రి, పూజా సామాగ్రి కొనుగోలు చేసేందుకు మంగళవారం మార్కెట్లలో కొనుగోలు చేస్తూ సందడిగా కనిపించారు. వర్షంలో కూడా మట్టి వినాయకులు, చిన్న చిన్న వినాయకులు కొనుగోలు చేస్తున్నారు. భరత్‌నగర్ కూరగాయల మార్కెట్, మూసాపేట, చిత్తారమ్మ టెంపుల్, వివేకానంద కాలనీ ప్రధాన రహదారి, కేపీహెచ్‌బీకాలనీ కూరగాయల మార్కెట్లలో వివిధ జిల్లాల నుంచి తీసుకువచ్చిన ఆకులను పత్రి, సామాగ్రిని ఉంచారు. ఆయా కాలనీ, బస్తీల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి వినాయక నవరాత్రుల కోసం మండపాలను సిద్ధం చేస్తున్నారు.



ఓల్డ్ బోయిన్‌పల్లి చౌరస్తాలో వినాయకులను కొనుగోలు చేస్తున్న ప్రజలు



పత్రి, పండ్లు, అరటి ఆకులు, పూలు అమ్మకానికి ఉంచిన దృశ్యాలు



సాంస్కృతిక కార్యక్రమంలో న్యూ ఎరా విద్యార్థులు



పంచశీల స్కూల్‌లో..

పాఠశాలల్లో వినాయక చవితి వేడుకలు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీలోని న్యూ ఎరా పాఠశాలలో వినాయక చవితి ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. 4, 5 తరగతుల విద్యార్థులు రకరకాల నృత్యాలతో అందరినీ అలరించారు. అటు ఆధ్యాత్మికతను తెలియజేసే నృత్యాలతో పాటు ఆధునికతతో కూడిన పాటలకు నృత్యాలు చేశారు. వినాయక విగ్రహాలను విద్యార్థులు స్వయంగా తయారు చేసిన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచశీల పాఠశాలలో...

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూలులో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించారు. విద్యార్థులు వినాయకుడు, శివ, పార్వతుల వేషధారణలో ఆకట్టుకున్నారు. విద్యార్థులు పసుపు, మట్టితో తయారు చేసిన వివిధ ఆకృతులను ప్రదర్శనలు ఉంచారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్జీ మౌంట్ లిటెరా పాఠశాలలో...

బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని శ్రీహరి నగర్‌లోని కిడ్జీ మౌంట్ లిటెరా పాఠశాలలో విద్యార్థులకు వినాయకుల ప్రతిమలను తయారు చేసే పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వినూత్నంగా టీ కప్పులతో, పేపర్‌తో, బిస్కెట్స్‌తో, టమాటాలు, పచ్చిమిరపకాయలు, వంకాయలు, ఆలుగడ్డలు వంటి కూరగాయలు, మట్టి, పసుపు, గోధుమ పిండితో విభిన్న ఆకృతులను తయారు చేశారు.



పసుపుతో తయారు చేసిన వినాయకుడితో పంచశీల విద్యార్థినులు



విద్యార్థులు తయారు చేసిన వినాయక ప్రతిమలతో కిడ్జి మౌంట్ లిటెరా విద్యార్థులు

ఫంక్షన్‌హాల్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలి



ఫంక్షన్ హాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- నిర్వహణ లేకపోవడంతో అధికారులపై ఆగ్రహం

కేపీహెచ్‌బీకాలనీ: డివిజన్ పరిధిలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి ఫంక్షన్ హాలును పరిశీలించారు. ఫంక్షన్ హాల్ పరిస్థితి చూసి అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో నిరుపేదలకు ఉపయోగపడుతుందన్న ఉద్దేశంతో ఈ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మించామని, ఎంతో మంది పేదలు నాడు వివాహాలు, శుభకార్యాలకు ఉపయోగించుకున్నారని గుర్తు చేశారు. నేడు కనీస నిర్వహణ కూడా చేయకుండా వదిలివేయడం వల్ల అసాంఘిక కార్యక్రమాలకు, జంతువులు, వ్యర్థాలతో అద్దాలు పగిలిపోయి అస్తవ్యస్తంగా మారిందన్నారు. సరైన మెయింటెనెన్స్ చేసి అత్యంత సుందరంగా తీర్చిదిద్ది ఉపయోగంలోకి తీసుకురావాలని, లేకుంటే చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, ఈఈ రమేష్, డీఈ శంకర్, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

కేపీహెచ్‌బీకాలనీ: వినాయక చవితిని పురస్కరించుకుని కేపీహెచ్‌బీ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మందలపు సాయిబాబు చౌదరి ఆధ్వర్యంలో మంగళవారం మట్టి వినాయకులను పంపిణీ చేశారు. సర్దార్ పటేల్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో, 6వ ఫేజ్ శివాలయం వద్ద, గోపాల్‌నగర్, రత్నదీప్ వద్ద ఉచిత మట్టి వినాయకులు, వినాయక వ్రతకల్పం పుస్తకాలను పంపిణీ చేశారు.



మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తున్న మందలపు సాయిబాబు చౌదరి

మొక్కలు నాటి సంరక్షించాలి

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ శ్మశాన వాటికలో జరిగిన వన మహోత్సం కార్యక్రమంలో మంగళవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శ్మశాన వాటికలో మొక్కలు నాటి వనమహోత్సవం హరిత వైభవోత్సవంగా విరాజిల్లుతుందన్నారు. ఔషధ గుణాలు ఉన్న మొక్కలు, పండ్ల జాతుల మొక్కలు నాటి ప్రజలకు ఉపయోగపడే మొక్కలను సంరక్షిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ దేవజా, మేనేజర్ శివ జ్యోతి, సూపర్‌వైజర్ నాగరాణి, నాయకులు సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, మల్లేష్, మహేష్, గోపాల్, లింగంప సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



క్రిస్టియన్ శ్మశాన వాటికలో మొక్క నాటుతున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ముగిసిన డబ్ల్యూఈడీపీ

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం మంగళవారం ముగిసింది. భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వశాఖ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ స్మాల్ బిజినెస్ డెవలప్‌మెంట్, నీతిఆయోగ్ సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశంలోని యువ, ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభావవంతమైన చొరవగా పలువురుఅభివర్ణించారు.

వంద పడకల ఆసుపత్రి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్‌లో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి పనులను కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ఎమ్మెల్యే కృష్ణారావు ఆధ్వర్యంలో వేల కోట్ల రూపాయల పనులు పూర్తి చేశామని, అలాగే పెండింగ్‌లో ఉన్న పనులు కూడా నేడు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆసుపత్రి పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తామని, నిరుపేదలకు ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, అధికారులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రగతి నగర్ రోడ్డు, అంబీర్ చెరువు వద్ద నిమజ్జనం కొలనులో వినాయక నిమజ్జన ఏర్పాట్లను కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. వినాయక నిమజ్జనాన్ని నిబంధలను పాటిస్తూ అధికారుల సూచనలతో తగు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. ట్రాఫిక్ అధికారులు తగు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కేపీహెచ్‌బీ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ మాధవ్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, ఎలక్ట్రికల్ డీఈ స్వప్న, ఇన్‌చార్జి సుధాకర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'మనూటా' నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ



రాయదుర్గం: 'మనూ' టీచర్స్ అసోసియేషన్ (మనూటా) కార్యవర్గం మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్‌అహ్మద్ ముఖ్య అతిథులుగా పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు. 2025–27 కాలపరిమితితో కూడిన కార్యవర్గంలో అధ్యక్షురాలిగా డాక్టర్ షబానాకేసర్, ఉపాధ్యక్షుడుగా డాక్టర్ సలావుద్దీన్ సయ్యద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అశ్వని, కోశాధికారి చావ్లా ముత్యాలరావు, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ సమద్‌తజే వడక్కయిల్, జాయింట్ సెక్రెటరీ పబ్లిసిటీ ముజాహిద్ పాషా సయ్యద్ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ టీచర్లు అంతా బాధ్యతాయుతంగా విధులను నిర్వర్తించడంతో పాటు విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమానికి ఇఫ్లూ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ లంకాల, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ షిరిన్, పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీఏఎం విద్యావేత్తగా ప్రొ. ఘనశ్యామ్ కృష్ణ

హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు అరుదైన అవకాశం

రాయదుర్గం: హెచ్‌సీయూ సీనియర్ ప్రొఫెసర్ ఎం ఘనశ్యామ్‌కృష్ణ ఆసియా పసిఫిక్ అకాడమీ ఆఫ్ మెటీరియల్స్(ఏపీఏఎం) విద్యావేత్తగా ఎన్నికయ్యారు. ఆయన స్కూల్ ఆఫ్ ఫిజిక్స్‌లోని సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎలక్ట్రానిక్స్ సైన్స్ అండ్ టెక్నాలజీలో సీనియర్ ప్రొఫెసర్. సన్నని ఫిల్మ్‌లు, నానో స్ట్రక్చర్డ్ మెటీరియల్స్, సెన్సార్ల రంగాలపై ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవకాశం లభించింది. ఏపీఏఎం అనేది ఆస్ట్రేలియా, రష్యా, భారతదేశం, చైనా, జపాన్, కొరియా, తైవాన్, సింగపూర్, హాంకాంగ్, మంగోలియా, ఉజ్బెకిస్తాన్, తుర్క్‌మెనిస్తాన్ దేశాల సభ్యులతో ఏర్పడిన సంఘం. 20 మంది పీహెచ్‌డీ విద్యార్థులను పర్యవేక్షించారు. ప్రస్తుతం హెచ్‌సీయూలో ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్ ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయనను పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు అభినందించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

గచ్చిబౌలి: నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అవసరమైన చర్యలను తీసుకోవాలని టీజీఎస్‌డీపీఎల్ సీఎండి ముష్రఫ్ ఫరూకీ అధికారులను ఆదేశించా రు. వైట్‌ఫీల్డ్ సెక్షన్ పరిధిలోని వడ్డెరబస్తీలో బస్తీబాటలో భాగంగా మంగళవారం ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ముష్రఫ్ ఫరూకీ మాట్లాడుతూ నిరంతర విద్యుత్ సరఫరా అందించాల్సిన బాధ్యత సంబంధిత ఇంజనీర్లపై ఉందన్నారు. విద్యుత్ సుర‌క్షా చర్యలను ఖచ్చితంగా అ మలు చేయాలని, అపఘాతాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజలతో మాట్లాడారు. సమస్యలను వెంటనే పరిష్కరించి వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఎటు చూసినా చెత్త కుప్పలే!

● వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన ● వ్యాపిస్తున్న విష జ్వరాలు ● పట్టించుకోని అధికారులు



ఆల్విన్‌కాలనీ పైపులైన్ రోడ్డులోని బ్రిడ్జిపై పేరుకుపోయిన చెత్తకుప్పలు

ఆల్విన్‌కాలనీ: పేరుకే మహానగరం..ఎక్కడ చూసినా చెత్త కుప్పలు పేరుకుపోయి గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. విశ్వ నగరంగా తీర్చిదిద్దుతున్నామన్న పెద్దల మాటలు గాలిలో బుడగలాగానే మిగిలిపోతోంది అని స్థానికులు వాపోతున్నారు. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పారిశుద్ధ్యం పడకేసిందని మండిపడుతున్నారు. కురుస్తున్న వర్షాలకు కాలనీలో పేరుకుపోయిన చెత్తా చెదారంతో కాలనీలోని వీధులన్నీ దుర్గంధపూరితంగా మారాయి. అసలే వర్షాకాలం, విజృంభిస్తున్న డెంగీ, మలేరియా వంటి జ్వరాలతో కాలనీ, బస్తీలు ఎక్కడ చూసినా ప్రజలంతా అనారోగ్య సమస్యలతోనే సతమతమవుతున్నారు.పేద, మధ్య తరగతి ప్రజలు అనారోగ్యానికి గురై ఆసుపత్రికి పోలేక అనేక మంది నానా అవస్థలు పడుతున్నారు. కాలనీలో రహదారుల వెంట పేరుకుపోయిన చెత్త కుప్పల దుర్గంధం, దుర్వాసనతో పాటు ఈగలు, దోమలు వృద్ధి చెంది కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో జీహెచ్‌ఎంసీ అధికారులు శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించకపోవడంతో కుప్పలు, తెప్పలుగా ఏ వీధిలో చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. శానిటేషన్ సిబ్బంది కూడా కాలనీ, బస్తీలలో రహదారుల వెంట చెత్తా చెదారాన్ని ప్రతి రోజు తరలించకుండా ఎక్కడ పడితే అక్కడ కుప్పలుగా పోయటం, రహదారులను పరిశుభ్రంగా ఉంచకపోవటం, చెత్త ఉన్న ప్రదేశాలలో బ్లీచింగ్ పౌడర్ కూడా వెదజల్లకపోవడంతో బ్యాక్టీరియా చేరి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కూకట్‌పల్లి, వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్ డివిజన్‌ల పరిధిలో చెత్తా చెదారాన్ని తరలించాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



కమల ప్రసన్న నగర్ బ్రిడ్జిపై ..



అస్‌బెస్టాస్ కాలనీ పార్కు వద్ద ..



పాపిరెడ్డి నగర్ పార్కు సమీపంలో ..